
మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


నర్సాపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# ప్రజల పక్షాన నిలబడతాం

- పని తప్ప పగలు, ప్రతీకారాలు తెలియని వ్యక్తి కేసీఆర్
- హ్యాట్రిక్ విజయాన్ని అందించినందుకు కృతజ్ఞతలు
- నర్సాపూర్ బీఆర్ఎస్ కంచుకోటని మరోసారి నిరూపించారు
- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం
- అధికారం కోల్పోవడం స్పీడ్ బ్రేక్ మాత్రమే
- అబద్ధాలు ప్రచారం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కింది
- కాంగ్రెస్ హామీల అమలుకు పోరాడుతాం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- నర్సాపూర్‌లో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు
- పెద్దఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

నర్సాపూర్, డిసెంబర్ 13 : పని చేయడమే తప్ప పగలు, ప్రతీకారాలు తెలియని వ్యక్తి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అధ్యక్షతన, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కృతజ్ఞత సభను నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరు కాగా, పార్టీ కార్యకర్తలు, ప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోట అని, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని గెలిపించి మరోసారి నిరూపించారన్నారు. బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అధికారం కోల్పోవడం కేవలం స్పీడ్ బ్రేక్ మాత్రమేనని, అంతిమంగా గమ్యం చేరేది బీఆర్ఎస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు మానసికంగా దెబ్బతీయడానికి ఎన్నో కుయుక్తులు పన్నుతారని ఎవరూ ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ఎవరికైనా ఇబ్బంది వచ్చి ఫోన్ చేస్తే గంటలోపే మీ ముందుంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్, బస్‌డిపో, రోడ్లు, మున్సిపాలిటీ తదితర సౌకర్యాలు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. మిషన్ భగీరథ నీటితో మహిళల కష్టాలు తీర్చామని, నాణ్యమైన కరెంట్‌ను అందించి రైతన్నలకు అండగా నిలబడ్డామని వెల్లడించారు. రెండు పంటలు పండేలా ఉచిత విద్యుత్ తీసుకువచ్చామని, ఎరువుల కొరత లేకుండా చేశామన్నారు. పింఛన్, కల్యాణ లక్ష్మి తదితర సంక్షేమ పథకాలను తీసుకువచ్చి తెలంగాణ ప్రజలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కడుపులో పెట్టుకొని చూసుకున్నారన్నారు. బీఆర్ఎస్‌పై అబద్ధాలు ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు నిజాన్ని తెలుసుకుంటారని, పనిమంతులెవరో త్వరలోనే తెలుస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ అనుకుంటే సగం మంది కాంగ్రెస్ నాయకులు జైల్లో ఉండేవారని, తెలంగాణను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ఆయన పనిచేశారని పేర్కొన్నారు. హౌసింగ్ స్కామ్‌లపై సీబీటీ ఎంక్వైరీ చేస్తే పెద్ద రిపోర్ట్ వచ్చిందని, ఒక్కో కాంగ్రెస్ నాయకుడు 40నుంచి 50 ఇండ్లు మింగేశారని ఎద్దేవా చేశారు. సాధించిన తెలంగాణలో కక్షలు, పగలతో ప్రజలు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో కేసీఆర్ పనిమీద దృష్టిపెట్టారన్నారు. బీఆర్ఎస్‌కు ఒడిదుడుకులు సహజమని గతంలో ఓడి గెలిచామని, పడిలేచామని పార్టీ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేశామన్నారు. సునీతాలక్ష్మారెడ్డి అనుభవజ్ఞురాలైన ఎమ్మెల్యే అని, తోడుగా మదన్‌రెడ్డి ఉంటారని వెల్లడించారు. నియోజకవర్గంలో పుకార్లను పటాపంచలు చేస్తూ హ్యాట్రిక్ విజయం సాధించామని, ఇందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట్రామ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర పోషించి ప్రజల గొంతుకను వినిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్, నాయకులు గాలి అనిల్‌కుమార్, సింగాయిపల్లి గోపి, కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు


## కార్యకర్తలే పార్టీకి బలం

**-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. తన విజయానికి కృషి చేసిన కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని కార్యకర్తలందరినీ ఒక్కతాటిపైకి తేవడంతో విజయం సాధించామని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా తన విజయం కోసం కష్టపడ్డారని తెలిపారు. మన ధైర్యమే కేసీఆర్ బలమని, నిరాశ చెందవద్దని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తెస్తామన్నారు.

**ఎమ్మెల్యేలు ఓడారు.. కేసీఆర్ కాదు**

**-మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**



అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రమే ఓడారని, కేసీఆర్ కాదని మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికి ఏడు స్థానాలు గెలవడం సంతోషంగా ఉందన్నారు. గెలుపునకు కృషి చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటుదామని పిలుపునిచ్చారు. ఆరు నెలల తర్వాత కాంగ్రెస్ నైజం బయటపడుతుందన్నారు. బీఆర్ఎస్‌కు పునాది రాళ్లు కార్యకర్తలేనని, వారిని కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు.

# ప్రజాభిప్రాయం మేరకే నిర్ణయాలు


డిగ్రీ కాలేజీ మైదానంలో మార్నింగ్ వాక్ చేస్తున్న మంత్రి పొన్నం

సిద్దిపేట, డిసెంబర్ 13 : ప్రజాభిప్రాయం మేరకే ప్రభుత్వ విధానాలు ఉంటాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ చేసి వాకర్లు, ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అభిప్రాయం మేరకు ప్రభుత్వం నడుస్తున్నదని, తమ అభిప్రాయాలను నేరుగా తెలియజేయాలన్నారు. కలెక్టర్‌లో కలెక్టర్ సమక్షంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజాభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రతిపక్షాలు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఏడాదిలోగా కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ.. రాజాసింగ్‌కు ఏమైనా జ్యోతిష్యం తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు పూర్తి స్వేచ్ఛతో తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు. మంత్రి వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రావు, నాగరాజు, అత్తు ఇమామ్ పాల్గొన్నారు.

**సిద్దిపేట డిగ్రీ కాలేజీ మైదానంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్**

**మోడల్ బస్టాండ్‌ను సందర్శించిన మంత్రి**

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 13: సిద్దిపేట మోడల్ బస్టాండ్‌ను బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, విద్యార్థులు బస్‌పాస్‌లు తీసుకోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఉచితంగా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. బస్సుల్లో ప్రయాణికుల పక్కనే కూర్చొని మహాలక్ష్మి పథకం ఎలా ఉందని వాకబు చేశారు. ఉచిత బస్సు సదుపాయంతో నెలకొన్న సందిగ్ధతను పూర్తిగా తొలగించాలని, పూర్తిస్థాయి విధివిధానాలు రూపొందించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు మహిళలు మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంట కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

# ఓడినా ప్రజల వెంట ఉంటా

**బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్**

తూప్రాన్, డిసెంబర్ 13 : గెలుపు గెలుపే, ఓటమి ఓటమేనని, తాను ఓడినా గజ్వేల్ ప్రజల పక్షాన ఉంటానని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజకీయమంటే ఒక్కరోజుల్లో పూర్తయ్యే పనికాదని, నిరంతరం ప్రజలతో ఉన్నప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు. ప్రజాక్షేత్రంలో ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మహేశ్, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌యాదవ్, నాయకులు నందన్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, గాడిపల్లి భాస్కర్, నత్తి మల్లేశ్, నరేందర్ చారి, దుర్గరాజు యాదవ్, తాటి విఠల్, నర్సోజి, గుమ్మడి శ్రీనివాస్, శివ్వమ్మ పాల్గొన్నారు.


తూప్రాన్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్